క్లుప్తంగా

గంగమ్మ ఒడికి గణనాథుడు



కందనూలు: జిల్లా కేంద్రంలోని ఎర్రగడ్డ కాలనీలో ఏర్పాటు చేసిన గణనాథుడిని సోమవారం నిమజ్జనం చేశారు. అంతకుముందు పట్టణ వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. డీజేల దప్పుసప్పుల మధ్య మహిళల కోలాటాలు, బతుకమ్మలు ఆడారు. యువకులు కేరింతలు కొడుతూ నృత్యాలు చేశారు. అనంతరం పట్టణ సమీపంలోని నాగనూలు చెరువు నిమజ్జనం చేశారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



కోడేరు: మండలంలోని తీగలపల్లి గ్రామానికి చెందిన కుర్వ గోపాల ఎల్లమ్మకు రూ.37,500లు, చాకలి తిరుపతమ్మకు రూ.23 వేలు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరయ్యాయి. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలో లబ్ధిదారులకు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి అందజేశారు.

అనారోగ్యంతో ఎంపీటీసీ మృతి

బల్మూర్: మండలంలోని కొండనాగుల ఎంపీటీసీ–2 పద్మావతి(40) అనారోగ్యంతో మృతి చెందింది. కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతూ హైదరాబాద్‌లోని బసవతారక ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. పరిస్థితి విషమించడంతో సోమవారం మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. బాధిత కుటుంబసభ్యులను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, ఎంపీపీ అరుణలు పరామర్శించారు. మృతురాలికి భర్త భాస్కర్, కుమారుడు, కూతురు ఉన్నారు.

బాధిత కుటుంబానికి రూ.4.30 లక్షల సాయం



కొల్లాపూర్: రెండు నెలల కిందట జరిగిన రోడ్డు ప్రమాదంలో పట్టణంలోని సత్యసాయి విద్యా విహార్ పాఠశాల నిర్వాహకుడు సులేమాన్ మృతి చెందాడు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో సంస్మరణ సభ నిర్వహించారు. కొల్లాపూర్, అచ్చంపేట, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి నియోజకవర్గాల్లోని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలతో పాటు, బీఆర్ఎస్ఎంవి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు హాజరై సులేమాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సులేమాన్ కుటుంబ సభ్యులకు రూ.4.30 లక్షలు ఆర్థికసాయం అందజేశారు. పిల్లల పేరిట ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. కార్యక్రమాల్లో ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోడేరు: మండలంలోని నర్సాయిపల్లి గ్రామానికి చెందిన సింగిల్ విండో వైస్ చైర్మన్ సత్యం మూడు రోజుల కిందట మృతిచెందాడు. దీంతో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి రూ.20వేలు, సింగిల్ విండో మాజీ చైర్మన్ బుచ్చారెడ్డి రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ మేరకు సోమవారం గ్రామంలో బాధితకుటుంబానికి నగదు అందజేశారు. కార్యక్రమంలో రాముడు, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు బాలస్వామి, గోవింద్, కుర్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

సబ్బండవర్గాలకు ప్రభుత్వం ప్రాధాన్యం



పెంట్లవెల్లి: సబ్బండవర్గాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని సింగిల్‌విండో చైర్మన్ విజయరామారావు, మండల అధ్యక్షుడు పోతుల వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం మండలంలోని కొల్లూరులో ఎస్సీ, వాల్మీకి, యాదవుల కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు వారు భూమి పూజ చేసి మాట్లాడారు. ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి కమ్యూనిటీ హాల్స్ మంజూరు చేయించారన్నారు. సురేందర్‌గౌడ్, అబ్దుల్‌హుస్సేన్, నర్సింహ, జ్ఞానేశ్వర్‌లు పాల్గొన్నారు.



నాగర్‌కర్నూల్ జెడ్పీ కార్యాలయంలో..



అచ్చంపేటలో



బల్మూర్‌లో



చారకొండ మండలం జూపల్లిలో



పెద్దకొత్తపల్లిలో..

మహాత్ముడికి ఘన నివాళి



కల్వకుర్తిలో గాంధీజీ, లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలలో పాల్గొన్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కందనూలు: జిల్లా వ్యాప్తంగా జాతిపిత మహాత్మాగాంధీ 154వ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. సోమవారం నాగర్‌కర్నూల్‌లోని ధర్నాచౌక్‌లో గాంధీ విగ్రహానికి రాజకీయ, ప్రజా సంఘాలు, ఉద్యోగులు, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. జెడ్పీ కార్యాలయంలో జెడ్పీ చైర్‌పర్సన్ శాంతాకుమారి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సత్యమేవ జయతే ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయ ఆవరణలో నాగం శశిధర్ రెడ్డి, కూచుకుళ్ల దామోదర్ రెడ్డిలు జాతీయ జెండాతో పాటు, పార్టీ జెండాను ఆవిష్కరించారు. బీజేపీ కార్యాలయంలో గాంధీజీ, లాల్‌బహదూర్ శాస్త్రి జయంతిలను నిర్వహించారు. గాంధీ పార్కులోని గాంధీ విగ్రహానికి ఆ పార్టీ జిల్లా నాయకుడు సుధాకర్ రెడ్డి పూల మాల వేసి నివాళులర్పించారు. జర్నలిస్టులపై దాడులను నిరసిస్తూ టీయూడబ్ల్యూజే ఐజేయూ జిల్లా నాయకులు గాంధీజీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు.

అచ్చంపేట రూరల్: పట్టణంలోని పాతబజార్‌లోని మహాత్మాగాంధీ విగ్రహానికి ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు, మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ, బీజేపీ నాయకులు సతీష్‌మాదిగ, శ్రీకాంత్ బీమా పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కొల్లాపూర్: మాజీమంత్రి జూపల్లి కృష్ణారావు తన అనుచరులతో కలిసి ర్యాలీగా వెళ్లి మహాత్ముని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ చైర్ పర్సన్ విజయలక్ష్మి, ఆర్యవైశ్య సంఘం నాయకులు ఉన్నారు. పట్టణంలోని గాంధీ హైస్కూల్‌లో గాంధీ విగ్రహానికి బీజేపీ జిల్లా అధ్యక్షులు ఎల్లేని సుధాకర్‌రావు పూలమాలలు వేశారు. శ్రీవాణి విద్యానిలయంలో రంగినేని జగదీశ్వరుడు పేదలకు దుస్తులు పంపిణీ చేశారు.

కొల్లాపూర్ రూరల్: మండలంలోన పలు గ్రామాలలో నాయకులు గాంధీజీ విగ్రహాలకు పూలమాలలు వేసి ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు.

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్, పాత పోలీసు స్టేషన్ ఎదుట సర్పంచ్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఆర్యవైశ్య సంఘం నాయకులు గాంధీజీకి నివాళులర్పించారు.

బిజినేపల్లి: ఎంపీడీఓ కార్యాలయం ఎదుట గాంధీజీ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు నివాళి అర్పించారు.

కల్వకుర్తి టౌన్: మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ సత్యంతో కలిసి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ గాంధీజీ, లాల్‌బహదూర్‌శాస్త్రికి నివాళులర్పించారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహాత్ముడి జయంతి సందర్భంగా గాంధీజీ స్ఫూర్తితో ముందుకెళ్దామని కల్వకుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్ రెడ్డి అన్నారు. పార్టీ కార్యాలయం నుంచి పట్టణంలో సత్యమేవ జయతే పాదయాత్ర చేపట్టారు.

కల్వకుర్తిరూరల్: పట్టణంలో లయన్స్‌క్లబ్, వాసవీక్లబ్‌తోపాటు వివిధ సంఘాలు, పార్టీల ఆధ్వర్యంలో గాంధీజీ జయంతి వేడుకలు నిర్వహించారు.

పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం నుంచి గాంధీజీ విగ్రహం వరకు కాంగ్రెస్ నాయకులు ర్యాలీ నిర్వహించారు.

తాడూరు: మండల కేంద్రంలో ప్రజాప్రతినిధులు, పలు పార్టీల నాయకులు హాజరయ్యారు. ఐతోల్ లక్ష్మయ్య, కృష్ణయ్యగౌడ్, ఎంపీటీసీ సుశీల, కృష్ణారెడ్డి, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కోడేరు: మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ ఎదుట సర్పంచ్ వెంకటస్వామి, ఎస్ఐ శేఖర్‌రెడ్డి గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో రంగినేని జగదీశ్వర్ రావు, శేఖర్‌రెడ్డి, శ్రీశైలం, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తెలకపల్లి: మండల కేంద్రంలో ప్రజాప్రతినిధులు గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. మహాత్ముడి అడుగుజాడల్లో నడుద్దామన్నారు. ఎంపీటీసీలు విజయలక్ష్మి, లక్ష్మమ్మ, సర్పంచ్ సురేఖ, ఉపసర్పంచ్ కృష్ణయ్య, ఈఓ భాస్కర్ పాల్గొన్నారు.

బల్మూర్: మండలంలోని తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో అధికారులు గాంధీజీ జయంతిని నిర్వహించారు. స్థానిక కూడలిలో గాంధీజీ విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం నాయకులు పూలమాలలు వేసి మిఠాయిలు పంచారు.

చారకొండ: మండల కేంద్రంలో వాసవీ క్లబ్ సభ్యులు, జూపల్లిలో యువజన సంఘం సభ్యులు నివాళులర్పించారు.

దోమలపెంట: ఈగలపెంటలోని భూగర్భ కేంద్రం పరిపాలన కేంద్రం శక్తి సదన్‌లో సీఈ సూర్యనారాయణరావు గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి సేవలను కొనియాడారు. ఎస్ఈ(ఓఅండ్ఎం) ఆదినారాయణ, డీఈలు, ఎస్‌పీఎఫ్ ఆర్ఐ సూర్య రావు పాల్గొన్నారు.

బిజినేపల్లి: తిమ్మాజీపేటలో గాంధీజీ విగ్రహాలకు అధికారులు, నాయకులు పూలమాల వేసి స్వాతంత్ర ఉద్యమంలో ఆయన చేసిన పోరాటాన్ని గుర్తు చేసుకున్నారు.

మన్ననూర్: గాంధీజీ, లాల్‌బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాల వేశారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. మండల కోఆప్షన్ సభ్యుడు ఎంఏ రహీం, నాయకులు వెంకటరమణ, సంబుశోభ, సత్యనారాయణ పాల్గొన్నారు.

లింగాల: మండల కేంద్రంలో నిర్వహించిన సత్యమేవ జయతే పాదయాత్రలో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిశీలకుడు పీవీ మోహన్, డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ వంశీకృష్ణ పాల్గొన్నారు.



పెంట్లవెల్లిలో..



బిజినేపల్లిలో..



తాడూరులో



కల్వకుర్తి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో..



కల్వకుర్తిలో ప్రతిజ్ఞ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



తిమ్మాజీపేటలో



మన్ననూర్‌లో



తెలకపల్లిలో..



ఈగలపెంట జెన్‌కో శక్తి సదన్‌లో..

గాంధీ విగ్రహానికి ఆశావర్కర్ల వినతి

నాగర్‌కర్నూల్‌రూరల్: జిల్లా కేంద్రంలో ఆశవర్కర్లు చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా సోమవారం వినూత్నంగా నిరసన తెలిపారు. గాంధీజీ విగ్రహానికి వినతిపత్రం అందజేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్దం పర్వతాలు మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గుంపల్లి అశోక్, ఆశా వర్కర్ల నాయకురాలు శకుంతల, చంద్రకళ, సువర్ణ, నాగలక్ష్మి, వరలక్ష్మి, శోభ, జయశ్రీ, గౌరమ్మ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

బిజినేపల్లి: మండల కేంద్రంలో గాంధీజీ విగ్రహానికి ఆశవర్కర్లు వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. తిమ్మాజీపేట మండల కేంద్రంలో ఆశావర్కర్లకు బీసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుపల్లి కృష్ణయాదవ్ సంఘీభావం ప్రకటించారు.



బల్మూరులో ఆశావర్కర్లకు మద్దతు తెలుపుతున్న డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ

బల్మూర్: మండల కేంద్రంలో ఆశావర్కర్ల సమ్మె శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ వంశీకృష్ణ సందర్శించి వారికి మద్దతు తెలిపారు. నాయకులు రాజేందర్, వెంకట్‌రెడ్డి, ఖదీర్, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం



తాడూరు: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ నాయకుడు కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ఆకునెల్లికుదురు, ఎంగంపల్లి గ్రామాలలో గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటా తిరిగి 6 గ్యారంటీ కార్డులను అందజేశారు. పార్టీ అధికారంలోకి వస్తే ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేస్తుందన్నారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌కు ఒక్కసారి అవకాశం ఇవ్వాలని ఆయన కోరారు. కార్యక్రమంలో తాడూరు, తెలకపల్లి జెడ్పీటీసీలు రోహిణిగోవర్ధన్‌రెడ్డి, సుమిత్రశ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు మల్లయ్య, గోవర్ధన్‌రెడ్డి, వల్లపురెడ్డి, అబీబ్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

ఫుడ్ కమిటీ కమిషన్ చైర్మన్‌కు సన్మానం



కల్వకుర్తిరూరల్: రాష్ట్ర ఫుడ్ కమిటీ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డిని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు రాములు సోమవారం హైదరాబాద్‌లోని చైర్మన్ క్యాంపు కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. పార్లమెంట్ నియోజక వర్గ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

తెలకపల్లి: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని రావేఫ్ విద్యార్థులు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని గౌరెడ్డిపల్లిలో పాలెం కృషి విజ్ఞానం కేంద్రం రావేఫ్ విద్యార్థులు స్వచ్ఛత సేవా కార్యక్రమం నిర్వహించారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలను వివరించారు. తడి,పొడి చెత్త, హానికరమైన చెత్త గూర్చి అవగాహన కల్పించారు. స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దేందుకు పాటుపడాలని సూచించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెచ్ఎం బిచ్యానాయక్, రావేఫ్ విద్యార్థులు తేజస్వీ, లహరి, చందన, నికిత, విమల తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న రావేఫ్ విద్యార్థులు

వాల్‌పోస్టర్ విడుదల

తాడూరు: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఈ నెల 9న నిర్వహించే ముదిరాజుల సింహగర్జన సభకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను సోమవారం బీఎస్పీ నాయకుడు పృథ్వీరాజు విడుదల చేశారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సభకు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.నాయకులు దేవదాసు, మల్లేష్, బాలరాజు, నరేష్, కల్యాణ్, లక్ష్మణ్, ప్రకాష్, సైదులు, తిరుపతయ్యలు పాల్గొన్నారు.

తెలకపల్లి: మండల కేంద్రంలోని సోమవారం నెహ్రూచౌరస్తాలో సింహగర్జన సభకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను తెలంగాణ ముదిరాజు మహాసభ నాయకుడు ఆర్ విజయ్ విడుదల చేశారు. నాయకులు మల్లేష్, తిరుపతయ్య, రేణయ్య, వెంకన్న, మల్లేష్‌తోపాటు, బీఎస్పీ నాయకులు శివశంకర్, బాలనాగయ్య, విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

ఉద్యోగుల నిరసన



తెలకపల్లి: సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీ ఉద్యోగులు, ఆశావర్కర్లు, మధ్యాహ్న బోజన కార్మికులు సోమవారం మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్మికులు ఎరుపురంగు చీరలు కట్టుకొని అంబేద్కర్ విగ్రహం నుంచి గాంధీ విగ్రహం వరకు భారీ ర్యాలీగా వెళ్లారు. మహాత్ముల విగ్రహాలకు వినతిపత్రాలు అందజేశారు. రైతు సంఘం రాష్ట్ర నాయకుడు గోపాస్ లక్ష్మణ్ వారికి మద్దతు తెలిపారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట బతుకమ్మ ఆడి నిరసన తెలిపారు. కార్యక్రమంలో చంద్రకళ, అక్బరీ, అలివేలుమంగ, పుష్ప, భారతి, నాగమణి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్లు నెరవేర్చే వరకు సమ్మె కొనసాగిస్తాం

కందనూలు: డిమాండ్లు నెరవేర్చే వరకు సమ్మె కొనసాగిస్తామని ఈ పంచాయతీ ఆపరేటర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు హసన్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ ఎదుట ఈ పంచాయతీ ఆపరేటర్ల సంఘం ఆధ్వర్యంలో శాంతియుత సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల అమలు చేయడంతో కీలక భూమిక పోసిస్తున్న తమను రాష్ట్ర ప్రభుత్వం విస్మరించడం తగదన్నారు. దశాబ్దాల కాలంగా విధులు నిర్వహిస్తున్నా ఉద్యోగ భద్రత లేదని, కనీస వేతనం అమలుకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కో ఈ పంచాయతీ ఆపరేటర్‌కు 8 నుంచి 10 గ్రామ పంచాయతీల పనులు అప్పచెప్పిన విధులు సక్రమంగా నిర్వర్తిస్తున్నామని కాని ప్రభుత్వం గుర్తించడం లేదని వాపోయారు. జిల్లా స్థాయిలో పని చేస్తున్న జిల్లా ప్రాజెక్టు మేనేజర్లకు, ఆపరేటర్లను జూనియర్ అసిస్టెంట్‌లుగా గుర్తించి పే స్కేల్ అమలుచేయాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని గాంధీ చిత్రపటానికి ఇచ్చి నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఆపరేటర్ల సంఘం నాయకులు శ్రీశైలం, నరేందర్, శరత్, భారతి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

బల్మూర్: మండలంలోని జినకుంటలో సోమవారం కాంగ్రెస్ పార్టీకి చెందిన మహిళ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కొండనాగుల గ్రామంలో కాంగ్రెస్, బీజేపీకి చెందిన పలువురికి ఎమ్మెల్యే బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ అరుణ, పీఏసీఎస్ చైర్మన్ నర్సయ్య, సుదర్శన్‌రావు, పెంటయ్య, గుడిగెమొల్ల రాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీ టీచర్ల సమ్మె

నాగర్‌కర్నూల్‌రూరల్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లు చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం కొనసాగింది. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు శిబిరాన్ని సందర్శించి వారికి మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయకార్యదర్శి పర్వతాలు, రామయ్య, అంగన్‌వాడీ నాయకులు కౌసల్య, సుగుణ, అనురాధ పాల్గొన్నారు.

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహయాదవ్ అంగన్‌వాడీ టీచర్లకు మద్దతు తెలిపారు. కనీసవేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నర్సింహనాయుడు, వంగభాస్కర్‌గౌడ్, భీంరెడ్డి, కార్తీక్, ఈశ్వరయ్య, ఆంజనేయులు, అంగన్వాడీ టీచర్‌లు, ఆయాలు పాల్గొన్నారు.

బల్మూర్: మండల కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లు భిక్షాటన చేశారు. అనంతరం గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. సమ్మె శిబిరాన్ని డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ సందర్శించి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు శంకర్, యూనియన్ నాయకులు భారతి, జయప్రద, లీలావతి, భాగ్యమ్మ, ఆయా గ్రామాల అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



నాగర్‌కర్నూల్‌లో మాట్లాడుతున్న శ్రీనివాసులు

బిజినేపల్లి: తిమ్మాజీపేట మండల కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లకు బీసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు బుర్గుపల్లి కృష్ణయాదవ్ తెలిపారు.

కొల్లాపూర్: పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ అంగన్‌వాడీ టీచర్లు ర్యాలీ నిర్వహించి, గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈశ్వర్, నీరజ, లక్ష్మి, చెన్నమ్మ, హుస్సేనమ్మ, పాల్గొన్నారు.

వృద్ధురాలు అదృశ్యం

నాగర్‌కర్నూల్ క్రైం: వృద్ధురాలు అదృశ్యమైన ఘటనపై సోమవారం కేసు నమోదు చేశామని ఎస్ఐ మహేందర్ తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం మండలంలోని పెద్దముద్దునూరు గ్రామానికి చెందిన వృద్ధురాలు ఉలిగమ్మ ఈ నెల 1న కూలీ పనులకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లింది. ఎంతకీ తిరిగిరాకపోవడంతో బంధువులు, చుట్టుపక్కల వెతికినా ఎలాంటి ప్రయోజనం లేకపోవడంతో బాధిత కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఇసుక అక్రమ రవాణా?



తాడూరు: మండలంలోని మేడిపూరును అనుసరించుకొని ఉన్న దుందుబీ వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. గ్రామానికి చెందిన కొంతమంది ట్రాక్టర్ల ద్వారా అడ్డుఅదుపు లేకుండా అధికార పార్టీ అండదండలతో ఇసుకను తరలిస్తున్నారని వాపోయారు. ప్రతి రోజు 5 నుంచి 10 ట్రాక్టర్ల ద్వారా ఇసుక లోడ్‌తో పోలీసు స్టేషన్ ముందు నుంచి వెళ్తున్నా పోలీసులు పట్టించుకోకపోవడం ఏంటని ప్రశ్నించారు. ఈ విషయమై ఎస్ఐ రామన్‌గౌడ్‌ను వివరణ కోరగా ఇసుక తరలించే వారికి ఎలాంటి అనుమతులు లేవని ఇసుక తరలింపు మా దృష్టికి రాలేదని ఆయన పేర్కొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

కల్వకుర్తిరూరల్: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మండల కేంద్రంలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌కు వారు వినతిపత్రం అందించారు. అంతకముందు ఆశావర్కర్లు మహాత్మా గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందించి నిరసన వ్యక్తం చేశారు. ఆయా కార్యక్రమాలలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్ ఏర్పాటు



పెద్దకొత్తపల్లి: పట్టణం నుంచి జొన్నలబొగుడ గ్రామ బీటీ రోడ్డు వెంట 11కేవీ విద్యుత్ లైన్, వీధి లైట్లను ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ ఇందిరారవినాయ్ తెలిపారు. కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరంహర్షవర్ధన్ రెడ్డి సహకారంతో విద్యుత్ కొరత తీరిందని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో వెంకటస్వామి, రాంబాబు, గోపాల్, రేడ్యా, రమేష్, ఈశ్వర్, నాగరాజు, ఎల్లస్వామి, చంద్రు, రవి, శివ, బాలరాజు, శ్రీకృష్ణ పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో గేదె మృతి

బల్మూర్: మండలంలోని తుమ్మెన్‌పేటలో విద్యుదాఘాతానికి గురై గేదె మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రైతు వీరయ్యకు సంబంధించిన గేదె గ్రామంలోని ఓ రైతు పొలంలో మేత మేస్తుండగా తెగిపడి ఉన్న విద్యుత్ తీగకు తగిలి అక్కడికక్కడే మృతిచెందింది. మృతి చెందిన గేదె విలువ సుమారు రూ.40 వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపారు.